సాక్షి
వికారాబాద్
శుక్రవారం ı 20 ı అక్టోబర్ ı 2023



కాంగ్రెస్‌ది త్యాగాల ఘనత

దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పదవులతోపాటు ప్రాణత్యాగం చేశారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ అన్నారు. 10లో▸



అనుమతులకు 'సువిధ'

ఎన్నికల సభలు, సమావేశాలకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేయాలని డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి సూచించారు. 10లో▸



కేంద్ర పథకాలతో మేలు

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని బీజేపీ జిల్లా నాయకుడు బలరాంగౌడ్ అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

మళ్లీ మాదే అధికారం

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

బంట్వారం: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం కోట్‌పల్లి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాంపూర్‌లో మహిళలతో కలిసి కోలాటం ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ప్రజలకు అపార విశ్వాసం ఉందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. నిత్యం అందుబాటులో ఉండే తనను మరో సారి ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

'కోడ్' ఉల్లంఘిస్తే చర్యలు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీల అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార వాహనాలకు అనుమతులు పొందిన తరువాతే సౌండు బాక్సులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజల ఇళ్లపై బ్యానర్లు ఏర్పాటు చేయరాదని, ఒకవేళ బ్యానర్లు ఏర్పాటు చేయాల్సి వస్తే ఆ ఇంటి యజమాని పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఇళ్ల గోడలపై ఏ పార్టీకి సంబంధించిన రాతలు ఉండరాదని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదల పార్టీ కాంగ్రెస్

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం గండీడ్ మండలం జిన్నారం గ్రామానికి బీఆర్‌ఎస్ నాయకులు టీఆర్‌ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పేదల పార్టీ అన్నారు. పేదల సంక్షేమం కోసం కృషి చేసేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వాలే అని పేర్కొన్నారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చిన వెంటనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు.

ఆటోలో రూ. 3,26,920 నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డబ్బును చూపుతున్న పోలీసు అధికారి

మర్పల్లి: మండల కేంద్రంలోని టీ జంక్షన్ వద్ద గురువారం పోలీసులు రూ.3 లక్షల 26వేల 920లు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి కథనం మేరకు.. మోమిన్‌పేట్ మండలం నుంచి జహీరాబాద్‌కు చెందిన సందీప్, సదాశివపేటకు చెందిన దస్తగిరి ఆటోలో వస్తున్నారు. మర్పల్లి టీ జంక్షన్ వద్ద వారి వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద రూ. 3,26,920 నగద ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి రసీదు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపాడు.

ప్యాకేజీ పట్టు.. జతకట్టు



ఒక్కొక్కరికి ఒక్కో రేటు

- పనులు, పదవులు, ప్యాకేజీల ఆఫర్
- కొనసాగుతున్న బేరసారాలు
- స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకులకు గాలం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో ఊపందుకున్న చేరికలు

వికారాబాద్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నామినేషన్లకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో అభ్యర్థులు, ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఓటర్లకు గాలం వేసేందుకు ఇంకా సమయం ఉండటంతో ముందుగా ద్వితీయ శ్రేణి నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు వల విసురుతున్నారు. ప్రధానంగా ఆయా పార్టీల్లో ఉన్న అసంతృప్తులను గుర్తించి వారిని తమవైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. వారి స్థాయి, హోదా, సామర్థ్యాన్ని బట్టి ఆఫర్లు ఇస్తున్నారు. కొందరికి పదవులు, ఇంకొందరికి పనులు, మరి కొందరికి ప్యాకేజీ ఇలా ఎరవేస్తున్నారు. ఇలాంటి అవకాశం మళ్లీ వస్తుందో రాదో అని పలువురు పార్టీలు మారుతున్నారు. ఇప్పటికే వలసలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోనే వలసలు ఎక్కువగా ఉన్నాయి.

ఒక్కొక్కరికి ఒక్కో రేటు

మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులే సొంత ప్రయోజనాల కోసం పార్టీలు, కండువాలు మారుస్తుంటే మనం మారితే తప్పేంటి అనే తరహాలో ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నారు. ఇప్పటికే చాలా మంది ఇటు కాంగ్రెస్, అటు బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకుల సామర్థ్యం, ప్రజా బలాన్ని బట్టి పార్టీలు ప్యాకేజీలు ఇచ్చి తమ వైపు తిప్పుకుంటున్నాయి. ప్రత్యర్థి పార్టీలోని అసంతృప్తులను మచ్చిక చేసుకునేందుకు అభ్యర్థులే రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇప్పటికే ముఖ్య అనుచరులు, నమ్మకస్తుల ద్వారా తమ పార్టీ లో చేరాలని కబురు పంపుతున్నారు.వారివారి అవసరాలను బట్టి ప్యాకేజీలు, పదవులు, పనులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

వలసల జోరు

అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల్లో చేరికలు ఊపందుకున్నాయి. ఈ రెండు పార్టీల నుంచే అటు నాయకులు ఇటు ఇక్కడి వారు అటు వెళుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో బలమైన వారిని తమ వైపు తిప్పుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ డైరక్టర్లు మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్ చైర్‌పర్సన్లకు గాల వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 150 మంది పేరున్న నాయకులు, ప్రజాప్రతినిధులు కండువా మార్చారు. గతంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవులు చేపట్టిన వంద మంది వరకు, 40 మంది ద్వితీయ శ్రేణి నాయకులు ఇటీవల పార్టీలు మారారు. ఈ పరంపర కొనసాగుతూనే ఉంది. ఇదే సమయంలో డబ్బులు సైతం చేతులు మారుతున్నట్లు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

సహజ మరణం కాదు హత్యే !

- 7నెలల క్రితం వెంకటయ్య మృతి
- అప్పట్లో సాధారణ మరణంగా అంత్యక్రియలు
- సర్పంచ్ లలిత ఫిర్యాదుతో పోస్టుమార్టం
- గొంతు నులిమి చంపినట్లు వైద్యుల ధ్రువీకరణ
- భార్యను అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు
- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు ఒప్పుకున్న మహిళ
- నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



తాండూరు టౌన్: ఏడు నెలల క్రితం ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది ఓ మహిళ. మృతుడిది సహజ మరణంగా చిత్రీకరించి అంత్యక్రియలు పూర్తి చేసింది. అప్పట్లో స్థానిక సర్పంచ్ ఫిర్యాదుతో ఆ వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. గురువారం అందిన పోస్టుమార్టం రిపోర్టులో అది సహజ మరణం కాదని, గొంతు నులిమి చంపారని వైద్యులు ధ్రువీకరించారు. దీంతో పోలీసులు మృతుడి భార్యను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి గురువారం వెల్లడించారు. తాండూరు మండలం ఖాంజాపూర్‌కు చెందిన దాసరి వెంకటయ్య(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ ఏడాది మార్చి 16న మృతి చెందాడు. సాధారణ మరణంగా భార్య సుజాత అందరినీ నమ్మించింది. అంత్యక్రియలు కూడా పూర్తి చేసింది. అయితే వెంకటయ్యది సహజ మరణం కాదని, హత్యకు గురై ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేయడంతో సర్పంచ్ లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే అంత్యక్రియలు పూర్తి చేసి రెండు రోజులైంది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం చేయించారు. 7 నెలల తర్వాత ఇందుకు సంబంధించిన రిపోర్టు వచ్చింది. అందులో వెంకటయ్యది హత్యగా వైద్యులు ధ్రువీకరించారు. గొంతు నులమడం ద్వారా ఊపిరాడక చనిపోయాడని నిర్ధారించారు. దీంతో గురువారం పోలీసులు మృతుని భార్య సుజాతను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా అదే గ్రామానికి చెందిన ప్రియుడు బసిరెడ్డి అలియాస్ రాంచందర్‌తో కలిసి భర్త గొంతు నులిమి హత్య చేసినట్లు ఒప్పుకుంది. దీంతో రాంచందర్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.



ఎన్నికల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

అభివృద్ధికే పట్టం కట్టండి

- తాండూరును అన్ని విధాలా అభివృద్ధి చేశా
- ఒక్కో వార్డుకు రూ. కోటి కేటాయించా
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- పింఛను డబ్బును ఎమ్మెల్యేకు విరాళంగా ఇచ్చిన వృద్ధురాలు

తాండూరు టౌన్: తాండూరు ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కోరారు. గురువారం పెద్దేముల్ మండలం గొట్లపల్లిలో ఏర్పాటు చేసిన తాండూరు పట్టణ ఎన్నికల శంఖారావ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలకు అతీతంగా తాండూరు పట్టణంలోని ఒక్కో వార్డుకు రూ. కోటి కేటాయించినట్లు తెలిపారు. కాలనీల్లో వరదనీటి సమస్య పరిష్కారానికి రూ. 16 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ప్రధాన రోడ్ల విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలో లారీల పార్కింగ్, వ్యవసాయ మార్కెట్ యార్డు, అంతారం గ్రామ శివారులో ఆటోనగర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాపరాయి పాలిషింగ్ యూనిట్లను జినుగుర్తి శివారులో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక వాడకు తరలించనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే పాత తాండూరు బ్రిడ్జి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలను ఖర్చు చేశానని, ఏళ్ల తరబడిగా ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఇక్కడి ప్రజల సమస్యలు తెలియని, మాయ మాటలతో మోసం చేసేందుకు వస్తారని, అలాంటి వారిని నమ్మరాదని ప్రజలకు సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ఆరోపించారు. మంత్రి మహేందర్ రెడ్డి అండతో రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీ విజయం సాధిస్తానని ధీమా వ్యక్త చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణా, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పట్లోళ్ల నర్సింహులు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంగీత ఠాకూర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరిమళ, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, రవిగౌడ్, శ్రీశైల్‌రెడ్డి, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫిదా..

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వల్లే తనకు పింఛన్ వస్తోందని, ఎన్నికల ఖర్చు కోసం తన పింఛన్ డబ్బు తీసుకోవాలని ఓ వృద్ధురాలు వేదికపైకి వచ్చి ఎమ్మెల్యేకు నగదు అందజేసి ఆశీర్వదించింది. దీంతో ఎమ్మెల్యే వృద్ధురాలి దాతృత్వానికి ఫిదా అయ్యారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన షహజాదీ బేగం తనకు వస్తున్న పింఛన్ నగదులో కొంత మొత్తాన్ని ఎమ్మెల్యేకు అందజేయడంతో సభా ప్రాంగణం చప్పట్లతో మారుమోగింది.

మిగిలింది 12 రోజులే..

- ఓటరు నమోదుకు ఈ నెల 31 వరకే గడువు
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుకు అవకాశం
- ఇప్పటికే ఓటరు తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 9,34,523 మంది
- పురుషులు 4,64,822 మంది
- మహిళలు 4,69,659 మంది



వికారాబాద్: జిల్లాలో ఓటర్ల నమోదుకు కేవలం 12 రోజులు గడువు మాత్రమే మిగిలింది. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మాత్రమే ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. ఎన్నికలు జరిగే ప్రతి సారీ ఓటు శాతం పెంచడం కోసం సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇందులో భాగంగానే ఓటరు నమోదుకు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తుంటారు. అంతేకాకుండా విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటు వజ్రాయుధంతో సమానమని, 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తుంటారు. నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఎన్నికల కమిషన్ ఈ నెల 31వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చింది. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ సైతం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, యువజన సంఘాలను ఇందులో భాగస్వాములను చేశారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కును నమోదు చేశారు. ఇప్పటికే ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. తెలంగాణలో ఎన్నికల కోడ్ ఈ నెల 9న అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. వచ్చేనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నవంబర్ 30న ఎన్నికలు నిర్వహిస్తారు. అయితే ఓటు శాతం పెంపే లక్ష్యంగా అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి నెల రోజుల ముందు వరకు గడువు ఇచ్చింది. అదీ ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పుడు ఓటరుగా నమోదు చేసుకున్న వారి వివరాలు, జాబితాను పోలింగ్ తేదీ నాటికి సప్లిమెంటరీ (అనుబంధంగా)గా ముద్రిస్తారు.

జిల్లాలో ఓటర్ల సంఖ్య..

ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఓటరు తుది జాబితాను ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 9,34,523 మంది ఉండగా, వీరిలో పురుషులు 4,64,822 మంది, స్త్రీలు 4,69,659 మంది, ట్రాన్స్ జెండర్లు 42 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. వికారాబాద్ నియోజకవర్గంలో 2,23,398 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 1,11,605 మంది, మహిళలు 1,11,780 మంది, ట్రాన్స్ జెండర్లు 13 ఉన్నారు. తాండూరులో 2,28,495 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,11,242 మంది, మహిళలు 1,17,243 మంది, ట్రాన్స్ జెండర్లు 10 మంది ఉన్నారు. పరిగిలో 2,52,379 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,27,835 మంది, మహిళలు 1,24,537 మంది, 7 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. కొడంగల్‌లో 2,30,251 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,14,140 మంది, మహిళలు 1,16,099 మంది, ట్రాన్స్ జెండర్లు 12 మంది ఉన్నారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు తమ ఓటు హక్కు ఉందో లేదో జాబితా ద్వారా పరిశీలించుకోవచ్చు. ఓటరు జాబితాలో పేర్లు లేనివారు, కొత్త ఓటర్లు విధిగా పేర్లు నమోదు చేసుకోవాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది.

కొబ్బరి కాయల విక్రయానికి వేలం

అనంతగిరి గుట్ట ఆలయానికి రూ.4.58 లక్షల ఆదాయం



పూజా సామగ్రి, కొబ్బరి కాయల విక్రయానికి వేలం నిర్వహిస్తున్న అధికారులు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట ఆలయంలో కొబ్బరి కాయలు, దీపారాధన సామగ్రి విక్రయించేందుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సత్యనారాయణ రూ.4.58 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపారు. నవంబరు 14 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు వ్యాపారం చేసుకునేందుకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నరేందర్, ధర్మకర్త పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి అశ్వవాహన సేవ



గరుడ వాహనంపై స్వామివారు



అశ్వవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి స్వామివారు అశ్వవాహనంపై కొలువుదీరి పుర విహారం చేశారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

గరుడ వాహన సేవలో..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వికారాబాద్ పరిధిలోని ఆలంపల్లి శ్రీ అనంతపద్మనాభుడు గురువారం రాత్రి గరుడ వాహనంపై విహరించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తజనం

ప్రకృతి పండుగ బతుకమ్మ



బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

- భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: ప్రకృతిలో లభించే పూలను ఆరాధించే పండుగ బతుకమ్మ పండుగ అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో గురువారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సంబరాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, కేశంపేట జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళలందరికీ ఎంతో ఇష్టమైన పండుగ బతుకమ్మ అన్నారు. ప్రకృతి పూలను పూజించి జరుపుకొనే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. తెలంగాణలో మాత్రమే జరుపుకొనే పూల పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ పండుగతో ప్రజల బతుకులు బాగుపడాలని ఆకాంక్షించారు. దుర్గామాత చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. ఈ విజయ దశమి వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, రెడ్డి జాగృతి నాయకురాలు అరుందతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకుడి దుర్మరణం

వైద్య పరీక్షలకు వెళ్లాల్సిన రోజే కన్నుమూత
మోమిన్‌పేటలో విషాదం


శివకుమార్ (ఫైల్)

మోమిన్‌పేట: ఎంతో కష్టపడి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువకుడు ఖాకీ యూనిఫాం వేసుకోవాలనే ముచ్చట తీరకుండానే ప్రాణం వదిలాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటకు చెందిన వడ్ల శివకుమార్(22)బుధవారం ఉదయం తెల్లవారుజామున తన తల్లి వడ్ల పద్మను సదాశివపేటలో దింపి వచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. మేకవనంపల్లి దాటిన తర్వాత తండా గేటు సమీపంలో వీరి బైక్.. ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందగా శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. రెండు రోజుల వ్యవధిలోనే తల్లీకొడుకులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇటీవలే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన శివకుమార్ గురువారం వైద్య పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. కొడుకుకు ఉద్యోగం రావడంతో తమ కష్టాలు తీరుతాయనుకున్న తండ్రి బ్రహ్మయ్య.. ఇటు భార్య అటు కొడుకు మృతితో గుండెలవిసేలా రోదిస్తున్నాడు.

దసరా వేడుకల ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంజుల

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి బోనమ్మ గుడి వద్ద నిర్వహించనున్న దసరా పండుగ ఏర్పాట్లను మున్సిపల్ చైర్పర్సన్ మంజుల గురువారం పరిశీలించారు. ప్రతి దసరాకు ఆలంపల్లి గుడి దగ్గర జరిపే షమీపూజ, రావణ దహనం ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిలర్ రామస్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ దొంగలపై పీడీయాక్ట్

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్

ఆమనగల్లు: రేషన్‌బియ్యం తక్కువధరకు కొని అధిక ధరకు విక్రయించే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆమనగల్లు పీఎస్ పరిధిలో ఈ ఏడాది 9 కేసుల్లో 50 క్వింటాళ్లకు పైగా రేషన్‌బియ్యం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డాయని తెలిపారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరిలో ఒక కేసు, మార్చిలో రెండు, ఏప్రిల్, మేలో ఒక్కో కేసు, జూన్, జూలైలో రెండు కేసుల చొప్పున నమోదయ్యాయని వివరించారు. రేషన్‌బియ్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ నిందితుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు కోసం రవాణాశాఖకు సిఫారసు చేయనున్నట్లు వివరించారు.

వారెంటీ లేని 'గ్యారెంటీ'లు ఎందుకు

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: వారెంటీ లేని ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ నాయకులు ఓట్లకోసం పల్లెలకు వస్తున్నారని ప్రజలు వారి మాయలో పడొద్దని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మన్నెగూడ జేకే ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 60 ఏళ్ల అధికారంలో ఉండి అభివృద్ధి చేయని వారు ఆరు గ్యారెంటీలతో ఎన్నికలకు వస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలు తెలంగాణలో ఉన్నాయన్నారు. తెలంగాణ అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి కేసీఆర్ ఆరోగ్యబీమా, రూ.400కే వంట గ్యాస్, ఎకరాకు రూ.16వేల రైతు బంధు, దళి/ త బంధు, గృహలక్ష్మి, బీసీ బంధు కొనసాగిస్తామన్నారు. 40ఏళ్లుగా పరిగి ప్రజానీకం తమ కుటుంబానికి అండగా ఉన్నారని ఎన్నిజన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేనిదని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి చేరవేసి ఎన్నికల్లో తన గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు అజీమొద్దీన్, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, రహీస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

కుల్కచర్ల: పేద ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలం పరిధిలోని పుట్టపహడ్ గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఆత్మీయసమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటుగా మౌలికసదుపాయాలను కల్పించేందుకు నిరంతరాయంగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రం అవకాశవాదుల చేతుల్లోకి వెళ్ళకుండా ప్రజలు ఆలోచనచేయాల్సిన అవసరం ఉందన్నారు. తొందరపాటు చర్యలతో తప్పిదం చేస్తే మళ్లీ మన ప్రాంతాలు వెనుకబాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందని చెప్పారు. కార్యకర్తలు 40రోజులు కష్టపడితే మరో ఐదేళ్ల స్వర్ణయుగ పాలనను ఆస్వాదించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, హరికృష్ణ, వెంకట్రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మన్నెగూడ చౌరస్తాలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మహేశ్‌రెడ్డి

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

డీఎస్పీ నర్సింహులు

నవాబుపేట: ప్రశాంత ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు కోరారు. గురువారం నవాబుపేట పీఎస్‌లో ఎన్నికల కోడ్, నిబంధనలపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. మత సంబంధమైన స్థలాలు, ప్రభుత్వ స్థలాల వద్ద ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే ప్రచారం చేసుకోవాలన్నారు. పోలింగ్ శాతం పెరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు, తహసీల్దార్ జయరాం, ఎస్‌ఐ భరత్ భూషణ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం


మాట్లాడుతున్న సంఘం నాయకులు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ప్రసాద్

అనంతగిరి: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టే వరకు ఉద్యమం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం వికారాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్ అధ్యక్షతన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు న్యాయం చేసే వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు బీసీలకు తగినన్ని స్థానాలు ఇవ్వలేదన్నారు వికారాబాద్ జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలుండగా ఒక వికారాబాద్ రిజర్వు అవ్వడంతో కొడంగల్ పరిగి తాండూరు ఒక్క స్థానం కూడా బీసీలకు ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. బీసీ నాయకులు మధ్య తగాదా పెట్టాలని చూస్తున్నారన్నారు. జాతీయ స్థాయిలో ఎంపీ ఆర్.కృష్ణయ్య నిర్వహించే ఉద్యమాలకు వికారాబాద్ జిల్లా ముందుండి పోరాడుతుందన్నారు. బీసీలంతా ఏకమై ఉద్యమం చేపడదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంఘం జాతీయ కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్కుమార్, మహిళా అధ్యక్షురాలు మాధవిలత, జిల్లా కార్యదర్శి కృష్ణ, కొడంగల్ ఇన్‌చార్జి బసవరాజ్, పరిగి ఇన్‌చార్జి నర్సింలు, వికారాబాద్ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, ఆయా మండలాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తేనే ప్రజలకు తారతమ్యాలు లేకుండా సంక్షేమ పాలన అందుతుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లిలోని 1వ వార్డు నుంచి 3వ వార్డు వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ స్కీమ్‌లను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ స్కీమ్‌లను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందన్నారు. బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో వన్‌మెన్ షో చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులనే సొంత నియోజకవర్గాలలో తిరగకుండా అడ్డుకొంటున్నారన్నారు. జిల్లాలో సాగిస్తున్న అవినీతి అక్రమాలను అరికట్టాలంటే బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, నాయకులు కోర్వార్ నగేష్, కావలి సంతోష్, రాజుగౌడ్ తదితరులున్నారు.


మల్‌రెడ్డిపల్లిలో కాంగ్రెస్ నేతల ప్రచారం

ఆశీర్వదించండి.. అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తే అందుబాటులో ఉండి సేవ చేస్తానని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చంద్రవంచ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో వంది మంది వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమా శంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న సుదర్శన్‌రెడ్డి వర్గీయులు

అవినీతి పాలనకు చరమగీతం పాడాలి


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి


టీఆర్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఇప్పాయిపల్లి సర్పంచ్

- ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు
- డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి
- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ పాలనంతా అవినీతిమయమేనని.. ధనిక రాష్ట్రంగా ఏర్పడిన రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబ పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అవినీతి చేయడం, కుటుంబ ఆస్తులు పెంచుకోవడం, జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వ ఆస్తులను అమ్మడం చేస్తున్న పాలనకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ నియంత పాలనకు స్వస్తి చెప్పకుంటే మన భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. తన కుమారుడిని సీఎం చేయలనే ఆకాంక్ష తప్పితే సీఎం కేసీఆర్‌కు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలనే ఆలోచనే లేదన్నారు. ప్రజలు ఓటుతో అవినీతి పాలనను అంతం చేయాలన్నారు.

తాండురు బరిలో ఉంటా: డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

తాను తాండురు నియోజకవర్గంలో పోటీ చేస్తున్నానని ఇక్కడ ఏవిధంగా నన్ను ఆదరించి అక్కున చేర్చుకున్నారో పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మన కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తాండురులో మీమీ బంధుమిత్రులతో నాకు మద్దతు అందించేందుకు మీరు సహాయంగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు విస్మరిస్తూ పార్టీ కోసం కష్టపడే వారికి గౌరవం, గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఇప్పాయిపల్లి సర్పంచ్ అనురాధాబాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుప్పలి వెంకటేశ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త ఉమాపతిరెడ్డి, మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు కొత్త అనితాఉమాపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు రాంలాల్ నాయక్, బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావుద్య శ్రీను, కనకం మొగులయ్య, కామునిపల్లి బాల్ రెడ్డి, శివయ్య, రమేశ్, గడ్డం వెంకటయ్య, నందు, బాబు, చిన్నయ్య, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతు, గండీడ్ మండల పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాం, చౌడాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్ప్లటి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులు నరసింహనాయక్, కుల్కచర్ల బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, అంతారం సర్పంచ్ కృష్ణ, సతీశ్, రాధారెడ్డి, రవి, అంజిలయ్య గౌడ్, శివానందు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీ.. వాహనదారుడి దుర్మరణం

నవాబుపేట: ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్లకొండ గేట్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. మోమిన్‌పేట మండలం దేవరంపల్లికి చెందిన కర్రె కాములు(25) గురువారం నవాబుపేట మండలం ఎల్లకొండలోని తమ బంధువుల వద్దకు వచ్చాడు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఎల్లకొండ గేట్ వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ భరత్‌భూషణ్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ అప్పటికే పారిపోగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌ది త్యాగాల ఘనత

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పదవులతో పాటు ప్రాణం త్యాగం చేశారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ మండలం నారాయణపూర్ లో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం చేపట్టారు. బంగారు మైసమ్మ ఆలయం వద్ద నుంచి నారాయణపూర్ గ్రామం వరకు బైక్ ర్యాలీలో చేపట్టారు. గ్రామస్తులు బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ గత పదేళ్లుగా అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మరోసారి మోసపోతే గోస పడతామన్నారు. పీఎం నరేంద్ర మోదీ జన్‌ధన్ ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తానని, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి మరిచారన్నారు. ప్రజా సంక్షేమానికి పాటు పడే కాంగ్రెస్‌కు పట్టం కట్టాలన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం లో పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ, కిషన్ నాయక్, రామచంద్రారెడ్డి, రత్నారెడ్డి, జాఫర్, ప్రహ్లాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

ప్రచార రథం ఆకర్షణ మంత్రం



యాచారం: ఎన్నికలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ప్రచారమే.. ఓటర్లను అన్ని రకాలుగా ఆకర్షించేందుకు ఎవరి శైలిలో వారు ప్రచారం సాగిస్తుంటారు.. ఈ ప్రచార ఘట్టంలో ప్రస్తుతం ప్రధాన భూమిక పోషిస్తున్నాయి ప్రచార రథాలు. అందుకే చూడగానే ఆకట్టుకునేలా అభ్యర్థులు పోటాపోటీగా వీటిని సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను, కాంగ్రెస్ పార్టీ తొలిజాబితా ప్రకటించడంతో ఆయా పార్టీ అభ్యర్థులు ప్రచారం షురూ చేశారు. బీజేపీ, బీఎస్పీ, వామపక్షాలు తమ అభ్యర్థులు అధికారికంగా ప్రటించకపోయినప్పటికీ ఆశావహులు.. ప్రచారం సాగిస్తూనే ఉన్నారు.

ఓటర్లను ఆకట్టుకునే రీతుల్లో ..

పోటీ అభ్యర్థులు ప్రచార రథాలను వినూత్నంగా, ఓటర్లను ఆకట్టుకునే రీతుల్లో తయారు చేయించుకుంటున్నారు. గతంలో జీపులు, ఆటో రిక్షాలకు సాధారణ మైకులు పెట్టుకొని గ్రామాల్లో, కాలనీల్లో తిరిగి ప్రచారాలు సాగించే వారు. ప్రస్తుతం ట్రెండ్ మారిపోయింది. ప్రచారరథం పైకి ఎక్కితే సకల సౌకర్యాలు ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. 250 వాట్స్‌ల ఆహుజ మైక్, రథానికి నాయకుల చిత్రపటాలు, కార్డులెస్ మైకు, కార్డుతో కూడిన మైకు రథంపై ఐదు నుంచి పది మంది ముఖ్యులు నిల్చొనేలా డయాస్, టైటిల్స్, చుట్టూ రెయిలింగ్స్, వాటర్‌ప్రూఫ్ కార్పెట్లు, పైన నిలబడి మాట్లాడే నాయకుడు కనిపించేలా ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. నగరంతోపాటు ఏపీలోని గుంటూరు నుంచి వీటిని ప్రత్యేకంగా తెప్పించుకుంటున్నారు.

ఈసుజు సుజికి ఫేమస్...

ప్రచార రథాల తయారీకి ఈసుజు సుజికి వాహనాలను ఎక్కువగా వాడుతున్నారు. గతంలో ప్రచారంలో ఉన్న మహేంద్ర, బొలేరో వాహనాలకు బదులు వీటిని వినియోగిస్తున్నారు. తమ పార్టీల అధినేతల ఫొటోలు, గుర్తులతో ఆకర్షించేలా రథాలను తయారు చేసుకుంటున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ వాహనాలు 16 దేశాల్లో ప్రధానంగా క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ వాహనాలను కొనుగోలు చేస్తే రోడ్డు టాక్స్ మినహాయించడంతో ఎక్కువగా కొంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

అనుమతులకు 'సువిధ'.. ఫిర్యాదులకు 'సీ విజిల్'

పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

పరిగి: ఎన్నికల సభలు, సమావేశాలకు సువిధ యాప్‌లో దరఖాస్తు చేయాలని, సమస్యలు ఉంటే సీ విజిల్ యాప్‌తో ఫిర్యాదు చేయాలని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి సూచించారు. దరఖాస్తు చేసిన వంద నిమిషాల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. గురువారం పట్టణంలో అఖిల పక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్టీల నాయకులు సమన్వయం పాటించాలని సూచించారు. గ్రామాల్లో అల్లర్లు చేయడం, అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలను అడ్డుకోవడం వంటివి చేయరాదన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని, నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామయ్య, ఎస్‌ఐ సత్యనారాయణ వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పరిగి: మాట్లాడుతున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

నిబంధనలు ఉల్లఘింస్తే చర్యలు

దోమ: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి సూచించారు. గురువారం పీఎస్ పరిధిలో సీఐ వెంకటరామయ్య, ఎస్‌ఐ రవిగౌడ్‌తో కలిసి రాజకీయ పార్టీల నేతలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా నిర్వహించుకోవలని సూచించారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ టీంల నిఘాలో ఉంటాయని, కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


దోమ: సమావేశానికి హాజరైన నాయకులు

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా

మీర్‌పేట: ప్రజా సంక్షేమ మేకాం గ్రెస్‌పార్టీ ధ్యేయ మని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ ప్రగతినగర్, సాయినగర్, రాఘవనగర్, మల్‌రెడ్డి రంగారెడ్డినగర్ కాలనీల్లో గురువారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ చేస్తుందని, గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు